# మిడ్‌నైట్ ఛానెల్

"కావాలనే నువ్వింత దూరంగా వుంటున్నావు. నాకిదేం నచ్చటం లేదమ్మాయ్...'' గునుస్తూ అన్నాడు శేఖర్.

వసుధ కిలకిల నవ్వింది.

''పెళ్లయ్యే వరకు ఈ మాత్రం దూరం అవసరమే కదా!... ఆ తర్వాత మీ ఇష్టమొచ్చినట్టు చేసుకోండి నన్ను!'' సిగ్గు పడుతూనే అన్నది.

## క్షమించవా, బావా!

### - బొమ్మిడి అచ్చారావు

''ఇష్టమొచ్చినట్టు- అంటే ...?''

''మీరెలా చెయ్యదలచు కుంటే అలా...''

''ఇంతలోనే సిగ్గెందుకు? నీ మాటల్నే రిపీట్ చేస్తున్నాను. నేనెలా చేసినా ఏమీ అభ్యంతర పెట్టకూడదు...''

''ఆ!... అహ, అదంతా పెళ్లయింతర్వాత మాత్రమే! మీరు కావాలనే నన్ను ఇబ్బందిలో పెట్టేస్తు న్నారు...''

''చూడమ్మాయ్, పెళ్లయిం తర్వాత చేస్తే తప్పు లేని పని, పెళ్లికి ముందు చేస్తే తప్పెలా అవుతుం ది?... అంటే... ఆ పని తప్పులేనిదనేగా అర్థం?...''

''ఇదిగో, మీరు మరీ మాటల గారడీలో నన్ను బోల్తా కొట్టించాలని చూస్తున్నారు. 'తప్పు' అనేదానికి నిర్వచనం ఎప్పుడూ ఒకటే! నేను బోల్తాపడను, మీ మాటల కసలే పడను. ఏం లాభంలేదు సార్!...''

''మరి దేనికి పడతావు?''

''అసలు నేను దేనికీ పడను, దేంట్లోనూ పడను...''

''ఛీ! నాక్కోపం వచ్చింది, నే వెళ్లిపోతున్నాను'' లేచి నిల్చున్నాడు శేఖర్.

వసుధ కంగారుగా చూసిందతని వంక. అతని ముఖం సీరియస్‌గా వుంది. నిజంగానే కోపమొచ్చి నట్టుంది.

''ప్లీజ్, నా మాట వినిపించుకోరా అయితే...!''

''ఊహు! ఈ విషయంలో మాత్రం నువ్వు నా మాట వినాల్సిందే! నీకు నామీద అపనమ్మకమా? ...''

''మీమీద నాకు అపనమ్మకమా!?''

''ముమ్మాటికీ. నమ్మకంలేని చోట ప్రేమకు విలు వలేదు. ప్రేమకు ఆయువుపట్టు నమ్మకం. ఒకరిమీద మరొకరికి విశ్వాసముండాలి.''

''ప్లీజ్, మీమీద నాకు విశ్వాసం లేదని మాత్రం అనకండి. మీమీద నాకు పూర్తి విశ్వాసముందని నిరూపించుకోవటానికి నన్నేం చేయమంటారు?''

''ఎందుకడుగుతావులే... నువ్వు చెయ్యలేవు''

''చేస్తాను- ప్రామిస్!''

''అయితే నన్నాపకు, అడ్డు చెప్పకు. నీమీద కోరికతో వేగిపోతున్నవాణ్ణి. నువ్వంటే నాకెంతో ఇష్టం. మనం శారీరకంగా ఏకంగా కాకపోయినా, మానసి కంగా ఎప్పుడో ఒకటయ్యాం. శరీరాలు కలిస్తే తప్పే మిటి?'' అతను సూటిగా ఆమె ముఖంలోకి చూస్తూ అన్నాడు.

వసుధ అతని చూపుల్నెదుర్కోలేక కళ్లు వాల్చు కుంది. ఆమె శరీరం సన్నగా వణుకుతోంది. ఆమె మనసు మంచి చెడ్డల్ని బేరీజు వేస్తోంది.

ఆమె ముఖంలో త్వరత్వరగా మారుతున్న రంగుల్ని స్పష్టంగా చూశాడు శేఖర్. ఆమె భుజ మ్మీద చెయ్యి వేశాడు. ఆమె సన్నగా ప్రకంపించ డాన్ని గ్రహించాడు. రెండో చేతిని రెండో భుజమ్మీద వేసి ఒక్కసారిగా ఆమెను దగ్గరకు లాక్కున్నాడు.

అమాంతం అతని గుండెలమీదికొచ్చి పడిపో యిందామె. ఆమె గుండె వేగంగా కొట్టుకుంటోంది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు బరువెక్కాయి. ముఖం మీద అతని వెచ్చని ఊపిరి ఏదో కొత్త అను భూతుల్ని, కోరికల్ని రేపు తోంది.

శేఖర్ సన్నగా నవ్వు తూ ఆమె నడుం మీద రెండు చేతులు బిగించి బలంగా తన గుండెల కదుముకున్నాడు. ఆమె బాధతో మూలిగింది. పక్కటెముకలు ఆ అద టుకు విరిగిపోయాయా అనిపించిందామెకు. అయినా బాధగా అనిపించటం లేదు.

శేఖర్ ఆమె ముఖాన్ని తన ముఖానికి దగ్గరగా లాక్కున్నాడు. ఆమె ఎర్రటి పెదాలు అతని పెదాల మీద అతుక్కుపోయాయి. ఆమెలో ప్రకంపనాలు పెదవి నుంచి ముఖమంతా అలుముకుని మెదడుకు చేరి తనువులోని ప్రతి అంగానికి విద్యుత్తును సరఫరా చేశాయి.

శేఖర్ ఆమె నడుము కింది నుంచి చేతుల్ని మెత్తగా వత్తుతూ ఎక్కడెక్కడో తడుముతున్నాడు. అతని ప్రతీ స్పర్శకు ఆమె పులకించిపోతోంది. శరీరం



రోమాంచితమవుతోంది. ఆమె అతని చేతుల్ని తోసివేయటానికి ప్రయత్నిస్తోంది. కాని ఆమె మనసు ఆమెకే ఎదురు తిరుగుతోంది. ఆమె ప్రతిఘటనలో ఏమాత్రం బలం లేదు. ఆ సంగతి అతనికి తెలిసిపోయింది.


చిన్నగా నవ్వుతూ చీర కుచ్చిళ్ళ మీద చేయివేశాడు. వసుధలోని కన్నెపిల్ల సహజంగానే ఎలర్టయింది.

''ప్లీజ్, శేఖర్, వద్దు... నాకెందుకో భయంగా వుంది. పెళ్ళికి ముందు నాకీ అనుభవం ఇష్టంలేదు.'' వసుధ పెదాలు మాత్రమే ఈ పలుకుల్ని వుచ్చరిస్తున్నాయి. కాని, ఆమె శరీరంలోని ప్రతి అణువు అతని పరిష్వంగాన్ని కోరుతోంది. అతనిలో ఐక్యమైపోవాలని ఆరాటపడుతోంది.

శేఖర్ మరికాస్త ముందుకు వెళ్ళాడు. ఆమె శరీరంలోని మెత్తని భాగాల్ని అతని బలమైన చేతులు అదుముతున్నాయి. ఎక్కడెక్కడో తాకకూడని చోట అతని శరీరం తనని తాకుతూ ఒరుసుకుంటుంటే ఆమె సర్వం మరచిపోయింది.

మరికొద్ది క్షణాల్లో ఆమె సర్వస్వం అతని మగతనానికి అర్పితమైపోయుండేది. ఆమె కన్యాత్వం పెళ్ళికి ముందే భగ్నమై పోయుండేది.

అయితే సరిగ్గా అప్పుడే ఎక్కడినుంచో టార్చిలైటు వెల్తురు వారిమీద పడింది. ముందుగా ఉలిక్కిపడి ఎలర్టయింది వసుధే! తన ప్రయత్నం విఫలమైపోయినందుకు విపరీతమైన ఆశాభంగంతోను, అసహనంతోను టార్చిలైటు వెల్తురుకు చేతినడ్డం పెట్టుకుని దుస్తుల్ని సరిచేసుకున్నాడు శేఖర్.




వసుధ సిగ్గుతో సగం చచ్చిపోయి అస్తవ్యస్తంగా తొలగిపోయిన గుడ్డల్ని అరకొరగా చుట్టేసుకుంది.

టార్చి తాలూకు వ్యక్తి దగ్గరకొచ్చి, ''ఎవరు మీరు? ఇంతరాత్రి వరకు పబ్లిక్ పార్కులో వుండ కూడదని తెలీదా? ఏమిటి మీరు చేస్తున్న పని?'' అని గద్దించాడు.

''అరెరె, కబుర్లు చెప్పుకోవటంలో పడిపోయి చీకటి పడిపోయిన సంగతే గుర్తులేదు... మీరు వాచ్‌మనా? సారీ బ్రదర్!...'' శేఖర్ ముఖాన నవ్వు పులుముకుంటూ లేచి నిల్చున్నాడు. వసుధ అప్పటికే లేచి నాలుగడుగులు అటుకేసి నిల్చున్నది.

''కబుర్లు చెప్పుకుంటున్నారో, ఏం చేస్తున్నారో తెలీని ముర్ఖుడ్ని కాదు. పోలీసులకు అప్పచెప్పమంటారా?'' హుంకరించాడతను.

''వద్దు వద్దు, వెళ్లిపోతాం...'' హడావిడిగా, వసుధను కూడా పట్టించుకోనంత వేగంగా బయటకు నడిచాడు శేఖర్. వసుధ ప్రాణం చచ్చిపోయింది. ఓ పక్క గుడ్డలు పూర్తిగా కట్టుకోలేదు. ఈ స్థితిలో రోడ్ మీదికెలా వెళ్లటం?

వసుధ ఓ క్షణం ఆగి కుచ్చిళ్లు పోసుకుని చీర సరిగా కట్టుకుంది. అంత వరకు శరీరంలో పుట్టిన వేడిసెగలు చప్పుగా చల్లారిపోయాయి. తనెంత ఘోర తప్పిదం చేయబోయిందో, ఎలా తప్పించుకోగలిగిందో, గ్రహింపుకు వచ్చేసరికి భయంతో ఒణికిపోయింది.

''శేఖర్...'' అంటూ పక్కకు తిరిగింది.

''ఆ! నువ్వెళ్లు వసుధా! నాకు పోలీసులంటే చచ్చేంత భయం. రేపు ఇందిరా పార్కులో కలుసుకుందాం, ఇక్కడొద్దు. రేపు సాయంత్రం ఐదు గంటలకు- సరేనా, బై!'' అంటూ అప్పుడే ఆగిన బస్ ఎక్కి పోయాడు.

''వెళ్లిపోయాడా?'' అన్నమాట పక్కనుంచి విని పించి త్రుళ్లిపడి చూసింది వసుధ.

ప్రదీప్ నవ్వుతూ చూస్తున్నాడామెను.

''నువ్వు... నువ్వు ఈవేళప్పుడు ఇక్కడున్నావేంటి?'' గొంతు తడబడింది. తనని తానోసారి కంగారుగా పరీక్షించుకుంది. జుట్టు బాగా చెదిరిపోయింది. గుడ్డలు కూడా బాగా నలిగిపోయాయి. ఇసక, ఎండుటాకులు చీరకు అక్కడక్కడ అతుక్కుని ఉన్నాయి.

''నేను చాలా సేపట్నుంచీ మీ ఇద్దరితోపాటు పార్కులోనే వున్నాను...'' చల్లగా చెప్పాడు ప్రదీప్.

పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడింది వసుధ.

''మరి... మరి నన్ను పలకరించలేదేం?'' అన డిగింది భయం భయంగానే.

''నువ్వు పలకరించే స్థితిలో లేవని!'' నవ్వాడతను.

''బావా... నాన్నతో చెప్పవు కదూ...'' బతిమాల్తున్నట్టు అన్నది వసుధ.

''దేని గురించి?...''

వసుధ తత్తరపాటుతో చూసిందతనివంక.

''శేఖర్ గురించి నీకో సంగతి చెప్పాలి వసూ!''

ఏమిటన్నట్టు చూసింది.

''అతను నిన్ను పెళ్లి చేసుకోవటానికి సిద్ధంగా లేడు.''

''ఎందుకలా అనుకుంటున్నావు?''

''అతను ఇదివరలో నీలాగే ఇద్దరమ్మాయిల్ని నమ్మించి, అవసరం తీర్చుకుని వదిలేశాడు. వాళ్లలో ఓ అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది. మరో అమ్మాయి ఊరు వదిలి పారిపోయింది.''

''బా...వా...'' వసుధ గొంతు వణికింది.

''నేను జెలసీతోనో, నీమీద కోపంతోనో ఈ మాట చెప్పటం లేదు వసూ! నేను అనుక్షణం అతన్ని వెంటాడి నీడలా సంచరించి సేకరించిన నిజాలు. అతనికి ఉద్యోగం కూడా లేదు. పెద్ద ఆఫీసర్‌నని నీతో అబద్ధమాడి నిన్నాకర్షించాడు, నీలో కోరికలు రేపాడు. నిన్ను పెళ్లి చేసుకుంటానని ఆశ చూపి తన అవసరం గడుపుకోవాలని చూస్తున్నాడు.''

''లేదు... అతనలాంటివాడు కాదు. శేఖర్ చాలా నిజాయితీపరుడు. నేనంటే ప్రాణం పెడతాడు. నామీద ఎనలేని ప్రేమ.''

''ఓకే! నీ మనసు నిండా అతనాక్రమించుకుని వుండగా, నేనేం చెప్పినా నీకు వినపడదు, నచ్చదు. ఆల్‌రైట్! నిలకడ మీద నిజం నీకే తెలుస్తుంది.''

బస్ వచ్చి ఆగింది. ఇద్దరు ఎక్కారు.

★ ★ ★

పరశురామయ్యకు వసుధ ఒక్కగానొక్క కూతురు. బి.ఎస్సీ సెకండియర్ చదువుతోంది. ప్రదీప్ ఆయన చెల్లెలు కొడుకు. ఎమ్మెస్సీ పాసై, కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. అమ్మా నాన్న ఇద్దరు ఒకేసారి యాక్సిడెంట్‌లో పోవటంతో మామయ్య ఇంట్లోనే వుంటూ చదువు పూర్తి చేసుకున్నాడు. మేనల్లుడ్ని ఇంటల్లుడుగా చేసుకోవాలనే కోర్కెతో వున్నాడు పరశురామయ్య.

అయితే వసుధకు మాత్రం గతిలేక ఇంట్లో వున్నాడనే చులకన భావముంది ప్రదీప్ పట్ల. వసుధ పట్ల ప్రేమాభిమానాలున్నా బయట పెట్టడు ప్రదీప్. ఆమెకు తనంటే ఇష్టం లేదని తెలిసాక తన మనసును ఎప్పటికీ బయటపెట్టకూడదనుకున్నాడు.

అయితే ఈ మధ్య ఆమె తరచు ఇంటికి ఆలస్యంగా రావటం, అలంకరణల్లోను వేషధారణలోను మార్పు రావటం గమనించి ఆమె ప్రేమలో పడివుండొచ్చని అనుమానించాడు. ఆమెను రహస్యంగా అనుసరించి ఆమె శేఖర్‌తో చనువుగా తిరగడాన్ని చూసి, శేఖర్ గురించి వాకబు చేశాడు. అతనికి నీతి నియమాలు లేవని, గాలికి తిరిగే రకమని, ఆడపిల్లల వేటగాడని త్వరలోనే ప్రదీప్‌కి తెలిసిపోయింది. ఆ రోజు నుంచి అతన్ని, వసుధను నీడలా అనుసరిస్తూనే వున్నాడు ప్రదీప్.

ఆ రాత్రంతా ప్రదీప్ మాటలు వసుధ చెవుల్లో గింగురుమంటూనే వున్నాయి. నిజంగా శేఖర్ నమ్మక ద్రోహం చేసే వ్యక్తేనా? లేనిదే ప్రదీప్ ఎందుకలా చెపుతాడు? అతనిపట్ల తనకిష్టం లేకపోయినా ప్రదీప్ అంటే ద్వేషం మాత్రం లేదు. ఈమధ్య అతని నిజాయితీని సిన్సియార్టీని మనసులోనే అభినందిస్తోంది కూడా.

తను ప్రదీప్‌ని ఎంత తక్కువ చేసి మాట్లాడినా, ప్రవర్తించినా పట్టించుకోడు. పరశురామయ్య ఎప్పుడైనా వసుధను మందలించబోతే ప్రదీప్ ఆమె పక్షాన మాట్లాడి మామయ్యను మరోమాట అననిచ్చేవాడు కాదు. పైగా తన మనసు ఎక్కడ బాధ పడుతుందోనని అనునిత్యం జాగ్రత్త పడుతూ తనపట్ల ఎంతో

సున్నితంగా మర్యాదగా ప్రవర్తిస్తాడు. ఒదిగి ఒదిగి ఉంటాడు. ఎందుకో ఆ రాత్రి ఆమె ఆలోచనల్లో మాటిమాటికి ప్రదీప్ చోటుచేసుకుంటున్నాడు. అతని సత్ప్రవర్తన గురించి పదే పదే గుర్తుకొస్తోంది. శేఖర్ గురించి తెలిసినా కూడా తనతో ఏనాడు ఆ విషయం ప్రస్తావించలేదు. తండ్రితో కూడా ఎన్నడూ చెప్పలేదు.

శేఖర్ రాత్రి తనని వంచించబోయాడా? తన అమాయకత్వాన్ని, అలసత్వాన్ని తెలివిగా తనకనుకూలంగా మార్చుకోబోయాడా? సమయానికి ఆ వాచ్‌మన్ రాకపోయుంటే తను... కన్యాత్వం కోల్పోయి పూర్తిగా శేఖర్ మీదనే ఆధారపడి, పెళ్లి చేసుకోమని అతన్ని దేవురించుకునే పరిస్థితిలో వుండేది. అంతా అయ్యాక అతను కాదంటే తన గతేమయ్యేది?

కాని... కాని శేఖర్ అలా మోసగించేరకం కాదని తన మనసు పదే పదే చెపుతోంది. అతన్ని తనెంతగానో ప్రేమించింది, ఆరాధించింది. అందుకే అతను గట్టిగా పట్టుబట్టి తనని దగ్గరగా తీసుకుని మైనంముద్దగా చేసేసి అనుభవించబోతున్నా అభ్యంతరం చెప్పలేకపోయిందంటే, అంతరాంతరాల్లో అతని మీద తనకున్న అనురాగాలేనని చెప్పక తప్పదు. అతని ప్రేమలో ద్రోహ చింతన వుందా!?!

ఏమైనా సరే, మర్నాడు పెళ్లి విషయం శేఖర్‌తో తేల్చేసుకోవాలి. అతను తనని నిజంగా ప్రేమిస్తున్నాడో లేదో తేలిపోతుంది! ఎప్పుడో తెల్లవారుజామున నిద్రలోకి జారింది. మర్నాడు మామూలుగానే కాలేజికి వెళ్లిపోయింది వసుధ. ఎప్పుడు సాయంత్రం అవుతుందా అని ఉగ్గబట్టుకుని క్లాసులో నిమిషాల్ని గంటలుగా గడిపింది. తర్వాత నాలుగ్గంటలకి ముందే కాలేజి నుంచి బయటపడి బస్ పట్టుకుని ఇందిరాపార్కు చేరుకుంది.

ఆమెకోసమే ఎదురు చూస్తున్న శేఖర్ ఎదురొచ్చి ఆప్యాయంగా ఆమెను రిసీవ్ చేసుకున్నాడు. మరుగ్గా వున్న పొదరింటి దగ్గరకు తీసుకువెళ్లాడు. ఇంకా పార్కుకి జనం రావటం మొదలుకాలేదు.

''వాట్ డియర్, నిన్నరాత్రి స్వర్గానికి అంగుళం దూరంలో ఉండగా ఆ వాచ్‌మన్ యముడిలా అడ్డొచ్చాడు! ఈరోజు ఏమైనాసరే మనం మిస్ కాకూడదు. ఇక్కడొద్దులే, మంచి హోటల్లో రూం బుక్ చేశాను, పోదాం పద'' ఆమె భుజమ్మీద చేతులు వేసి లాలనగా అన్నాడు శేఖర్.

అతని చేతుల్ని మృదువుగా తోసేసి, ''ముందు మన పెళ్లి సంగతి తేల్చండి. మా నాన్నగార్కి ఈరోజే మిమ్మల్ని పరిచయం చేస్తాను, రండి. ఆయన నా మాట కాదనరు. మన పెళ్లికి వెంటనే ముహూర్తం పెట్టిస్తా'' అన్నది వసుధ అతని ముఖంలోకి సూటిగా చూస్తూ.

శేఖర్ తడబడి, ''ఇప్పుడేనా? అమ్మో, మీ నాన్నగార్ని చూడాలంటే భయం! అయినా మన పెళ్లికి తొందరేమిటి? పెళ్లయిపోతే ప్రేమించటానికి టైముండదు. పైగా, పెళ్లికి ముందున్న థ్రిల్ పెళ్లయిపోయాక వుండదు. పెళ్లి కాకుండా దొంగచాటుగా అనుభవించే శృంగారంలో అనిర్వచనీయమైన ఆనందముంటుంది'' అన్నాడు కవిత్వ ధోరణిలో.

''అంటే.. ఆ ఆనందం మీకు ముందే తెలుసా?'' వెంటనే అడిగేసింది వసుధ.

''నో, నో! నాకలాంటి అనుభవాలేం లేవు, నువ్వే నా మొదటి, చివరి ప్రేయసివి. పోనీ, హోటల్‌కెందుకులే, ఈ పొదరిల్లే మన పడకటిల్లు, ఇక్కడికెవరూ రారులే...'' అంటూ ఆమెని ఒడిసి పట్టుకుని చటుక్కున మీదికి లాక్కున్నాడు శేఖర్. అతని గుండెల మీద పడబోతూ నిలదొక్కుకుని వెనక్కి అడుగు వేసింది వసుధ.

''ఏమిటీ ఈరోజు బెట్టు చేస్తున్నావ్. నిన్న ఎంతో అనుభవమున్నదానిలా అల్లుకుపోయావు! ఇంతలోనే పతివ్రత వేషాలా?'' బలవంతంగా ఆమెను కౌగిలించుకోబోయాడు.

వసుధకి అతని నిజస్వరూపం అర్థమైపోయింది. అతనంత పచ్చిగా మాట్లాడుతుంటే అసహ్యం వేసింది. ''సిగ్గువేయటం లేదూ, అలా మాట్లాడటానికి? నన్ను ముట్టుకోకు, పక్కకు తొలుగు'' అన్నది సీరియస్‌గా.

శేఖర్‌కి ఆమెలో వచ్చిన మార్పు, ఆమె మాట తీరు వెంటనే అర్థమైపోయాయి. ''ఓహో! ఎదురు తిరుగుతున్నావే! నిన్ను తేలిగ్గా వదుల్తాననుకున్నావా? వాచ్‌మన్‌కి ముందుగానే డబ్బులు కొట్టించాను. మనవైపు రమ్మన్నా రాడు. నీ పని పూర్తిచేసిగాని నిన్నొదలను.'' ఆమెను అమాంతం ఒడిసి పట్టుకుని తటాలున నేలమీద పరుండబెట్టేశాడు.

వసుధ పెనుగులాడింది, గుప్పెళ్లతో అతన్ని మోదింది. కేకలు వేసింది. అయినా శేఖర్ తన ఉడుంపట్టు మరింత బిగించాడే కాని వదల్లేదు. ఆమె ముఖం మీదకు వంగి ఆమె పెదాలను కొరకబోయాడు.

సరిగ్గా అప్పుడే ఎవరో వెనకనుంచి బలంగా అతని జుట్టు పట్టుకుని పైకి లేపి ముఖం మీద గట్టిగా చరిచారు. శేఖర్‌కి దిమ్మ తిరిగిపోయిందా దెబ్బతో, తల తిప్పి చూశాడు.

ఎదురుగా ప్రళయ భయంకర రూపంలో ప్రదీప్!

అంతలోనే మరో నాలుగు దెబ్బలు తగిలించాడు ప్రదీప్. శేఖర్ అతన్నెదుర్కోబోయాడు. కాని ప్రదీప్ అతన్ని ఒక్క అంగుళం కూడా బెసగనివ్వకుండా కాళ్లతోను చేతుల్తోను కుమ్మేశాడు. అతన్నెదిరించే శక్తి తనకు లేదని శేఖర్‌కి అర్థమైపోయింది. రెండు చేతులు జోడించి ప్రదీప్‌కి దండం పెట్టేశాడు.

ప్రదీప్ అతని తలను ఇనపరాడ్స్ వంటి తన మోచేతుల మధ్య ఇరికించి ఊపిరి తిరగనివ్వకుండా చేసి, ''మళ్లీ మరో ఆడపిల్లవంక కన్నెత్తి చూడనని ప్రమాణం చెయ్యి'' అన్నాడు.

''బుద్ధొచ్చింది. మరే ఆడపిల్ల వంకా చూడను. నన్నొదిలెయ్యండి'' అంటూ లెంపలేసుకున్నాడు శేఖర్.

''పో... పోయి బుద్ధిగా బతుకు. మరోసారి ఏ ఆడపిల్లతోనైనా కనిపించావంటే, నీ కాళ్లు విరగ్గొట్టి చేతిలో పెడతాను'' పట్టు వదిలేశాడు ప్రదీప్. అతను వదిలిందే తడవుగా వెనక్కు తిరిగి చూడకుండా పారిపోయాడు శేఖర్.

''బావా!'' అవమానంతోను సిగ్గుతోను ప్రదీప్ వంక చూడలేకపోయింది వసుధ. ''నువ్వు చెప్పింది అక్షరాల నిజం. వాడు నన్ను పాడుచెయ్యాలని చూశాడు రాస్కెల్. ఇంత దుర్మార్గుడని, నయవంచకుడని కల్లో కూడా ఊహించలేదు'' అన్నది పశ్చాత్తాపం నిండిన స్వరంతో.

''వాడు నిన్ను పాడు చెయ్యాలని ప్రయత్నించటం ఇది రెండోసారి...'' చల్లగా చెప్పిన ప్రదీప్ వంక నిర్ఘాంతపోయి చూసింది వసుధ.

''అంటే, నిన్న పబ్లిక్‌గార్డెన్‌లో జరిగిందంతా...'' ఆమె నోటినుంచి మాటలు రాలేదు.

''అంతా కాకపోయినా కొంత చూశాను, మరి కొంత ఊహించాను. శేఖర్ నీమీద అత్యాచారం చేయబోతున్నాడని గ్రహించాను. అందుకే వాచ్‌మన్‌ని పంపి అతని ప్రయత్నాన్ని భగ్నం చేశాను'' చెప్పాడు ప్రదీప్.

''బా..వా..'' రెండు చేతులెత్తి నమస్కారం చేసింది వసుధ. ''నేనంటే నీకసహ్యం వేయటం లేదూ...?!''

''లేదు. నీ అమాయకత్వానికి జాలేస్తోంది. నిన్ను నా అక్కున చేర్చుకుని ఓదార్చాలనిపిస్తోంది. నిన్ను నా దానిని చేసుకోవాలనిపిస్తోంది.''

వసుధ కళ్లు విప్పార్చి ఆశ్చర్యంగా చూసిందతని వంక.

''ఇంత జరిగాక కూడా నన్ను పెళ్లి చేసుకోగలవా?...''

''నీకభ్యంతరం లేకపోతే!...'' నవ్వాడు ప్రదీప్.

ఒక్కసారిగా సుడిగాలిలా అతన్ని అల్లుకుపోయి ఏడ్చేసింది వసుధ.

''బావా, నువ్వు మనిషివి కాదు- దేవుడివి! నన్ను, నా తొందరపాటును క్షమించు. నీపట్ల నేను అమానుషంగా ప్రవర్తించాను. నువ్వు పెద్ద మనసుతో మన్నించావు...''

ప్రదీప్ ఆమెను అపురూపంగా దగ్గరకు తీసుకుని ఆప్యాయంగా వెన్ను నిమిరాడు. ★